క్లుప్తంగా

గిద్దలూరులో ఆధార్ కేంద్రం ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో గల సెయింట్ పాల్స్ ఎయిడెడ్ పాఠశాల వద్ద ఆధార్ కేంద్రాన్ని స్థానిక ఎంఈఓలు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆధార్ కేంద్రం ఒక్క బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో మాత్రమే అందుబాటులో ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రంలో రాచర్ల, గిద్దలూరు మండలాల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: ఉపాధి హామీ పనుల్లో కొలతల ప్రకారం పనిచేస్తేనే గిట్టుబాటు కూలి దక్కుతుందని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాపాయిపల్లెలో చేపడుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను ఆయన తనిఖీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్ ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేసినప్పుడే మెరుగైన వేతనం అందుకుంటారన్నారు. మస్టర్‌లో కూలీల హాజరు వివరాలు పరిశీలించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, టీఏ అంబటి రమేష్ పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో ఉచిత సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లను పేదలకు ఉచితంగా కేటాయించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, 2025–26 విద్యాసంవత్సరానికిగాను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా ఒకటో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు బి.రాందాస్‌నాయక్, కె.శర్వాణి శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఈ నెల 19వ తేదీ లోగా cse.ap.gov.i n వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీల్లో అల్పాదాయం ఉన్న వారి పిల్లలు అర్హులని స్పష్టం చేశారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు మూడు కిలోమీటర్ల దూరంలోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పేద కుటుంబాలకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే ఎంఈఓ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

కులగణనను స్వాగతిస్తున్నాం

తర్లుపాడు: కేంద్ర ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన చేయాలన్న నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర నూర్‌బాషా ముస్లిం యువజన సంఘం అధ్యక్షుడు డిపి మస్తాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగణనతో దేశంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలను గుర్తించి అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

మార్కాపురం డివిజన్‌లో 30 పోలీసు యాక్ట్

మార్కాపురం టౌన్: మార్కాపురం డివిజన్‌లో 30 పోలీసు యాక్ట్ ఈనెల 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని డీఎస్పీ యు.నాగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించాలనుకుంటే ముందుగా పోలీసు శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి లేకుండా ఎవరైనా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తి పరవశం.. బ్రహ్మోత్సవం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. శుక్రవారం చెన్నకేశవస్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా కోడూరి, బొర్రా కుటుంబ సభ్యులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

అడ్రస్ లేని స్వచ్ఛత!



కొమరోలు : ఇస్లాంపేటలో సైడు కాలువలో మురుగు నిల్వ



కొమరోలు : ఓ ఇంటి పక్కనే డ్రైయినేజీలో పేరుకుపోయిన మురుగు



గొట్లగట్టులో రహదారి పక్కన పేడదిబ్బ

- డ్రైయినేజీలు సక్రమంగా లేక ఎక్కడికక్కడ మురుగు నిల్వ
- పోగుబడిన చెత్తను తొలగించే దిక్కూ లేదు
- జనంపై దండయాత్ర చేస్తున్న దోమలు





పెదారికట్లలో ఇళ్ల ముందు నిల్వ చేరిన మురుగు

కొమరోలు/కొనకనమిట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛదివస్ పేరుతో చేపట్టిన కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో ఎలాంటి ప్రభావం చూపడం లేదు. దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని సెలవిస్తున్న అధికారులు.. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్న సంగతినే మరిచారు. పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని సంకోచం లేకుండా చెబుతున్న అధికార యంత్రాంగం.. తమ బాధ్యతను మాత్రం సక్రమంగా నిర్వహించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ మురుగు దర్శనమిస్తోంది. కొమరోలు పట్టణంలోని ఇస్లాంపేటలో సైడు కాలువలు ఉన్నప్పటికీ పూడిక తీయకపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసన వస్తుండటంతోపాటు దోమలు విజృంభించి జ్వరాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైయినేజీ సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. డ్రైయినేజీలు, చేతిపంపుల వద్ద మురుగు నిల్వ చేరడంతో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. పెదారికట్లలో సైడు కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. మినీ ట్యాంక్‌లను శుభ్రం చేయకపోవడంతో మలినాలతో కూడిన నీటిని పట్టుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు మండలంలోని పెదారికట్ల, పాతపాడు, గొట్లగట్టు, వెంగళపల్లి బీసీ కాలనీ, నాగంపల్లి, నాగరాజుకుంట, సిద్ధవరం గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితి దారుణంగా ఉంది. పాతపాడులో ఇళ్ల ముందే పేడ దిబ్బలు వేస్తుండటంతో వర్షాల సమయంలో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయి. గొట్లగట్టు, నాగిరెడ్డిపల్లిలో రహదారి వెంట చెత్తాచెదారం వేస్తుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

డ్రైయినేజీలు శుభ్రం చేయాలి



పెదారికట్లలో ఏ వీధిలో చూసినా సైడు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పూడిక తీయకపోవడంతో నీరంతా ఇళ్ల ముందరకు వస్తున్నాయి. దుర్వాసనతో పాటు దోమలు ఎక్కువయ్యాయి. ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు పారిశుధ్యంపై పెద్దగా స్పందించడం లేదు. పైఅధికారులు చెప్పిన రోజు మాత్రం అరకొరగా పారిశుధ్య పనులు చేపట్టి మమ అనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టేలా చూడాలి. ప్రజలు రోగాల బారిన పడకుండా పనులు చేట్టాల్సిన అవసరం ఉంది.

– బి.వెంకటనరసింహారావు, పెదారికట్ల

ఆరోగ్యకరమైన జీవనశైలి అలవర్చుకోవాలి



పొదిలిలో మాట్లాడుతున్న సీడీపీఓ సుధామారుతి



గిద్దలూరు : మాట్లాడుతున్న సీడీపీఓ జ్యోతి



మార్కాపురం : అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కొనకనమిట్ల: ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ సుధా మారుతి పేర్కొన్నారు. శుక్రవారం కొనకనమిట్ల, గొట్లగట్టు గ్రామాల్లో కిశోర బాలికలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. కిశోర బాలికలకు సాధికారత కల్పించాలనే లక్ష్యంతో వేసవి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంచి ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, వైద్యాధికారి ఎస్పీ బాలయ్య, ఈఓపీఆర్డీ శ్రీదేవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సరిత, లక్ష్మీప్రసన్న, హెల్త్ సూపర్‌వైజర్ శైలజ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోరి వికాసం శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

మార్కాపురం: వేసవి సెలవుల నేపథ్యంలో బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు కిశోరి వికాసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి రత్న ప్రసాద్, మార్కాపురం సీడీపీఓ సుశీలాదేవి, ఎంఈఓ శర్వాణి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యునిసెఫ్ సహకారంతో మే 2 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ మహిళా పోలీసులను కన్వీనర్లుగా నియమించినట్లు పేర్కొన్నారు. 10 నుంచి 18 ఏళ్ల వయసున్న బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, సంపూర్ణ ఆరోగ్యం, పౌష్టికాహారం, సెల్ఫ్ డిఫెన్స్, పోక్సోచట్టంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రమాదేవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రాయవరంలో అవగాహన కార్యక్రమాన్ని వెలుగు ఏపీఎం పిచ్చయ్య ప్రారంభించారు. డాక్టర్ సాయి చరణ్‌తేజ, శ్రీకాంత్, నాగభూషణం, విమలమ్మ, లలిత సలోమి పాల్గొన్నారు.

పొదిలి: కిశోర బాలికల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునేందుకు కిశోరి వికాసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ సుధామారుతి తెలిపారు. శుక్రవారం స్థానిక బాప్టిస్ట్ పాలెం పాఠశాలలో వేసవి శిక్షణను ప్రారంభించారు. సీడీపీఓ మాట్లాడుతూ.. జూన్ 10వ తేదీ వరకు ప్రతి మంగళ, శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో మహిళా పోలీసులు కన్వీనర్లుగా ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభాషిణి, సావిత్రి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై అవగాహన

గిద్దలూరు రూరల్: కిశోరి వికాసం సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్ కార్యక్రమంపై అవగాహన అవసరమని స్థానిక సీడీపీఓ బి.జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని కోటగడ్డ సచివాలయం పరిధిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. 11 నుంచి 18 ఏళ్ల వయసుగల అమ్మాయిలు, అబ్బాయిలకు గ్రూపుల వారీగా మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కౌమార బాలికల సమస్యలు, సంరక్షణ, ఆరోగ్యం, సాధికారిత, స్వశక్తి, సమర్థవంతమైన జీవితం సంపన్న జ్ఞానం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శంకర జయంతి



మార్కాపురంలో ఆది శంకరాచార్యులకు పూజలు చేస్తున్న అర్చకులు



గిద్దలూరులో పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: జగద్గురు ఆది శంకరాచార్య జయంతిని మార్కాపురం పట్టణంలోని శివాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శంకరాచార్యుల విగ్రహాన్ని అర్చకులు హరిప్రసాద్ శర్మ ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక ఉచిత ఉపనయనాలను అర్చకులు రెంటచింతల రామకృష్ణ చేశారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధన జరిగింది. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు తంగిరాల నాగజగన్నాథ్, ఓవి మల్లిక్, పురాణం సుబ్రమణ్యం, ఏఎల్ఎన్‌వీ సుబ్బారావు, సోమయాజుల శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: సనాతన ధర్మాన్ని పరిరక్షించిన జగద్గురు ఆదిశంకరాచార్యులు అందరికీ ఆరాధ్యులని రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు పి.హనుమంతారెడ్డి పేర్కొన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా పట్టణంలోని కాశినాయన కుంట ఆవరణలో గల గాయత్రిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రాజమోహన్‌రావు

మార్కాపురం టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు సూచించారు. శుక్రవారం పట్టణంలోని రాజ్యలక్ష్మి కాలనీలోని ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తెలియని నంబర్ల నుంచి సెల్‌ఫోన్లకు వచ్చే వెబ్ లింకులను ఓపెన్ చేయవద్దని, ఎవరైనా వాట్సప్‌కాల్ చేసి బెదిరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌లో నూతన చట్టాలు అమల్లోకి వచ్చాయని, హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు లేకుంటే భారీగా జరిమానా కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. వేసవిలో ఇళ్ల భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. అనుమానిత వ్యక్తులు వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

ఉద్యాన పంటల సాగుపై పూర్తి రాయితీ



మాట్లాడుతున్న ఏపీఓ గురువరకుమార్

బేస్తవారిపేట: రైతులకు ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఏపీఓ గురువరకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వీఏఏ, వీహెచ్ఏ, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ, టీఏ, ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఉద్యానవన పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బత్తాయి, మామిడి, నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, బండ్ ప్లాంటేషన్‌లో కొబ్బరి మొక్కలు నాటుకోవచ్చన్నారు. 5 ఎకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ కింద 100 శాతం రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఉద్యానశాఖ అధికారిణి డి.శ్వేత, హెచ్ఈఓ శేషగిరి పాల్గొన్నారు.

కొనకనమిట్ల మండలంలో మోస్తరు వర్షం



గొట్లగట్టులో కారుమబ్బులు


కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గొట్లగట్టు, చినమనగుండం, పాతపాడు, బచ్చలకూరపాడు, నాగంపల్లి, సలనూతల, వింజవర్తిపాడు గ్రామాల్లో కురిసిన వర్షానికి లోతట్టు పొలాల్లో నీరు చేరింది. గొట్లగట్టు పంచాయతీ కార్యాలయం, మెయిన్ రోడ్ స్పీడ్ బ్రేకర్ వద్ద వర్షం నీరు నిల్వ చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు





గొట్లగట్టు మెయిన్ బజారులో శిథిలావస్థలో స్తంభాలు



గొట్లగట్టులో పక్కకు వాలిన విద్యుత్ స్తంభం



పైన ఒరిగిన కాసారం



పాతపాడు పొలాల్లో స్తంభానికి అల్లుకుపోయిన తీగజాతి మొక్కలు

కొనకనమిట్ల: మండలంలో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని స్తంభాలు కూలేందుకు సిద్ధంగా ఉండగా, మరికొన్ని విద్యుత్ స్తంభాలను తీగజాతి మొక్కలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా మండలంలోని గొట్లగట్టు గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఒక్క పక్కకు వాలిపోయాయి. మెయిన్ బజారులో కూడా స్తంభాలు శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు బయటపడటంతో ఎప్పుడు కూలిపడతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పాత స్తంభాల పక్కన కొత్తవి వేశారు కానీ విద్యుత్ తీగలు లాగలేదు. శిథిలమైన వాటిని కూడా తొలగించలేదు. పలు చోట్ల స్తంభాలపై బిగించిన కాసారాలు ఒరిగి ఉన్నాయి. అలాగే బచ్చలకూరపాడు బస్టాండ్ దగ్గరలోని పొలాల్లో ఉన్న రెండు విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. పెదారికట్ల గ్రామంలో చాలాకాలంగా ఉన్న విద్యుత్ ఇనుప స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా చోట్ల నేలవాలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వేసవిలో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, గాలుల ధాటికి స్తంభాలు కూలక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవం



స్వామివారి గ్రామోత్సవంలో భక్తులు

కంభం: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవం, ఊంజల్‌సేవ కార్యక్రమాలు వేడుకగా సాగాయి. ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.